


RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు..

PEN SATTA Telugu Daily






అనకాపల్లి | సంపుటి: 2 | సంచిక: 148 | శనివారం | 26-10-2024 | ఎడిటర్ : చింతమనేని అనీల్ కుమార్ | పేజీలు : 4 | వెల : 3.00


## దొంగతనాలను అరికట్టేందుకు

### సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా





అనకాపల్లి పెన్ సత్తా అక్టోబర్ 25: దొంగతనాలను అరికట్టేందుకు, చోరీ సొత్తు రికవరీ శాతాన్ని పెంచేందుకు అనకాపల్లి జిల్లా పోలీసు సెంట్రల్ క్రైమ్ స్టేషన్ సిబ్బందితో సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా. శు క్రవారం జరిగిన ఈ సమావేశంలో పరవాడ లో జరిగిన ఏటీఎం దొంగతనం లో నిందితులు వాడినట్లు అనుమానిస్తున్న వాహనం కేరళ రాష్ట్రం, త్రిశూర్ లో ఇదే రకమైన నేరంలో పట్టుబడిన నిందితుల వాహనంతో సరిపోలడంతో పీ.టీ వారెంట్ పై నిందితుల్ని ఇక్కడికి తీసుకుని వచ్చి విచారించలని ఎస్పీ అన్నారు. జిల్లాలో జరుగుతున్న దొంగతనాలు ఏ విధంగా జరుగుతున్నది తెలుసుకుని, చేయవలసిన కార్యాచరణ గూర్చి అధికారులకు సూచనలు చేశారు. ఎస్సై ల నేతృత్వంలో క్రైమ్ టీం లను ఏర్పాటు చేసి, దొంగతనల్లో పోగొట్టుకున్న ఆస్తి రికవరీ శాతాన్ని పెంచేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. రాత్రి, పగలు గస్తీలను ముమ్మరం చేయాలన్నారు. ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టంతో అనుమానాస్పద వ్యక్తుల వేలిముద్రలను తనిఖీలు చేయాలన్నారు. జైలు నుండి విడుదలైన నిందితుల కదలికల పై నిఘా కొనసాగించాలని, సరిహద్దు జిల్లాల పోలీస్ అధికారులతో మాట్లాడి నేరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేసే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఊర్లకు వెళ్లే వారు తమ ఇంటిని ఎల్.హెచ్.ఎం.ఎస్ లు పెట్టుకోవడం ద్వార పోలీసు లు పర్యవేక్షించేందుకు అవకాశం ఉంటుందన్నారు. బైట ఊర్లకు వెళ్లే వారు ఇంటి లో విలువైన బంగారం, నగదు తదితర బ్యాంక్ లాకర్ లో పెట్టుకొనే విధంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనుమానస్పద వ్యక్తుల కదలికలను పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ క్రైమ్స్ ఎల్.మోహన్ రావు, సీ.సీ.ఎస్ ఎస్సైలు రమేష్, సత్యనారాయణ, ప్రసాద్ ఫణిదాసు ఇతర సీ.సీ.ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## హోంమంత్రిని కలిసిన ఎస్పీ తుహిన్ సిన్హా



అనకాపల్లి పెన్ సత్తా అక్టోబర్ 25: జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా జిల్లా ఎస్పీ గా బాధ్యతలు స్వీకరించిన తరువాత శుక్రవారం రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ని నక్కపల్లి క్యాంప్ ఆఫీస్ వద్ద మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా అనిత ఎస్పి కి శుభాకాంక్షలు తెలియజేసారు. అనంతరం ఎస్పీ తో మాట్లాడుతూ జిల్లాలో గంజాయిని అరికట్టేందుకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని, మహిళలను వేదించేవారి పై ఉక్కు పాదం మోపాలన్నారు. జిల్లాలో లా అండ్ ఆర్డర్ ని సక్రమంగా నిర్వహించేటట్టు, సిబ్బందిని ఎప్పటికప్పుడు జాగురూకతతో వృత్తిని నిర్వహించేటట్టు ముందుండి నడిపించాలని ఎస్పీ ని కోరారు.

## అనుమతులు లేకుండా బాణాసంచా దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

### - రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖ కమిటీ సూచించిన ప్రదేశాలలో మాత్రమే దుకాణాల ఏర్పాటుకు అవకాశం



కోన సీమ పెన్ సత్తా అక్టోబర్ 25: దీపావళి పండుగ సందర్భంగా ఎటువంటి అనుమతులు లేకుండా జిల్లాలో ముందస్తు బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తే అటువంటి వారి పై చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకోబడతాయి అని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ హెచ్చరించారు. జిల్లాలో అక్టోబర్ 29 నుంచి అక్టోబర్ 31 సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే బాణాసంచా విక్రయించడానికి అనుమతి ఉంది అన్నారు. అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటూ ప్రమాదాలు జరగకుండా దుకాణాలు నిర్వహించుకోవాలి అన్నారు. అధికారులు జారీచేసిన తాత్కాలిక లైసెన్సులు పొందినవారు మాత్రమే బాణాసంచా దుకాణాలు నిర్వహించాలని, అనుమతులు లేకుండా బాణాసంచా విక్రయిస్తున్న దుకాణాలను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీపావళి పర్వదినం సందర్భంగా దుకాణాలు ఏర్పాటు చేసుకొని బాణాసంచా విక్రయించాలనుకునేవారు ముందస్తుగానే తాత్కాలిక దుకాణాలు నిర్వహించడానికి రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖ అధికారుల వద్ద అనుమతులు తీసుకోవాలన్నారు. తాత్కాలిక లైసెన్స్ పొందడానికి స్థానిక మండల పరిధి లోని రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక అధికారులకు దరఖాస్తు చేసుకున్న పిమ్మట వారు ఆ దరఖాస్తులను పరిశీలించి సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారికి అనుమతులు ఇవ్వచ్చని నివేదించిన తర్వాత సదరు రెవెన్యూ డివిజన్ అధికారి లైసెన్సులు జారీ చేస్తారని పేర్కొన్నారు. రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖ అధికారులతో కూడిన ముగ్గురు సభ్యుల కమిటీ ఒక నిర్దేశిత ప్రాంతంలో బాణా సంచాలు విక్రయించడానికి ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం లేని ప్రాంతాలను గుర్తిస్తారన్నారు. ముగ్గురు సభ్యుల కమిటీ సూచించిన ప్రదేశాలలో మాత్రమే తాత్కాలిక లైసెన్సులు పొందిన వ్యాపారస్తులు అందరూ దుకాణాలు నిర్వహించుకోవాలని తెలిపారు. దుకాణదారులు భద్రతాపరంగా అన్ని జాగ్రత్తలు తీసుకొని అధికారులు జారీ చేసిన మార్గదర్శకాలను పాటిస్తూ ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా దుకాణాల నిర్వహించుకోవాలని కలెక్టర్ తెలిపారు.

## కేంద్ర హోంశాఖ సంప్రదింపులు కమిటీ సభ్యులు గా సీ.ఎం రమేష్





అనకాపల్లి పెన్ సత్తా అక్టోబర్ 25: వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖల సంప్రదింపుల కమిటీల్లో రాష్ట్రానికి చెందిన పలువురు ఎంపీలకు చోటు లభించిన నేపథ్యంలో కేంద్ర హోంశాఖ సంప్రదింపులు కమిటీ సభ్యులు గా అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీ.ఎం రమేష్ నియమితులయ్యారు. కేంద్ర హోం శాఖ సంప్రదింపుల కమిటీకి చైర్మన్ అమిత్ షా వ్యవహరించనున్నారు. ఈ కమిటీలో సహాయ మంత్రులు తో పాటు 15 మంది లోక్సభ, 13మంది రాజ్యసభ, ఇద్దరు ఎక్స్ అఫీషియో సభ్యులు గా ఉంటారు అని కేంద్రం నుండి అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై సీ.ఎం రమేష్ స్పందిస్తూ పార్లమెంట్ స్టాండింగ్ కమిటీలో కీలకమైన రైల్వే శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ గా, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, ఫైనాన్స్ కమిటీ సభ్యునిగా, ఇప్పుడు హోం శాఖ సంప్రదింపుల కమిటీలో సభ్యునిగా తనను నియమించినందుకుగాను ప్రధాని నరేంద్ర మోడీ కి, కేంద్ర హోంశాఖ మాత్యులు అమిత్ షా కి, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. తనను నమ్మి గురుతరమైన బాధ్యతలు అప్పగిస్తూ, ఉన్నత స్థాయికి చేరుకునేలా ప్రోత్సహిస్తున్నందుకు నరేంద్ర మోడీ కి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని తెలిపారు. అదేవిధంగా అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా శుభాకాంక్షలు తెలియజేసిన కూటమి నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## రైతు సేవ కేంద్రం సిబ్బందికి నైపుణ్య శిక్షణ కార్యక్రమం





అనకాపల్లి పెన్ సత్తా అక్టోబర్ 25: సబ్ డివిజన్ రైతు సేవ కేంద్రం సిబ్బందికి నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా వనరుల కేంద్రం, ఆర్ కే వి వై నిధులు, ఆత్మ సౌజన్యంతో శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా నూతన సాంకేతికతో సమగ్ర వ్యవసాయ విధానాల పై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన రావు సూచించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు పి శ్రీధర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన నేషనల్ పెస్ట్ సర్వైలెంట్ సిస్టం యాప్ ను అందరూ వినియోగించాలని సూచించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ ఏ ఆర్ ఎస్) కీటక శాస్త్రవేత్త డాక్టర్ సరిత మాట్లాడుతూ ప్రస్తుతం వరి పొలంలో తెగుళ్లు, పురుగులు ఉధృతి ఎక్కువగా ఉందని తెలిపారు. వరిలో పొడ తెగులు, ఆకు ముడత నివారణకు హెక్సా కొనజోల్ అనే మందును రెండు మిల్లీ లీటర్లు లీటర్ నీటికి, ఎసిఫేట్ 1.5 గ్రామ్స్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయవలసిందిగా ఆర్ ఎస్ కె సిబ్బంది కి సూచించడం జరిగింది. వరి లో బీపీటీ 5204 రకానికి సుడి దోమ ఉధృతి ఎక్కువగా ఉన్నందున లీటర్ నీటికి 1.5 గ్రా ఎసిపెట్ లేదా బీఫ్రొఫుసన్ 2.5 మీ.లి లీటర్ నీటికి కలిపి పిచకారీ చేయాలి. ఆదే విధంగా వరి పంటకు ఎకరానికి 25 కేజీల యూరియా, 15 కేజీల పోటాస్ వేయవలసిందిగా రైతులకు సూచించాలని తెలియజేశారు. అదేవిధంగా బ్యాక్టీరియా ఎండు (పండా ఆకు) తెగులు నివారణకు గాను ప్లాంటో మైసిన్ 100 గ్రా లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి. అనకాపల్లి సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో ఉన్న వివిధ పథకాల పై క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి సబ్ డివిజన్లో ఉన్న మండల వ్యవసాయ అధికారులు, జిల్లా వనరుల కేంద్రం సిబ్బంది, రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## త్వరలోనే నూతన టూరిజం పాలసీ



విశాఖపట్నం: కూటమి ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో టూరిజం నూతన పాలసీ సిద్ధమవుతుందని టూరిజం మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. శుక్రవారం సీఐఐ టూరిజం అండ్ ట్రావెల్స్ సదస్సులో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఏపీలో టూరిజంకు పారిశ్రామిక హోదా ఇస్తామని సీఎం చంద్రబాబు అన్నారని తెలిపారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రం పర్యాటకంగా నష్టపోయిందని విమర్శించారు. పర్యాటకం పడకేసిన సందర్భం గత ప్రభుత్వంలో చోటు చేసుకుందని విమర్శించారు. ఈ ప్రభుత్వం పర్యాటకానికి పెద్ద పీట వేస్తుందని స్పష్టం చేశారు. పర్యటక కోసం స్వదేశీ, ప్రసాద్ స్కీమ్స్ కేంద్ర ప్రభుత్వం ఏపీకి సహకారం ఇస్తుందన్నారు. విశాఖలో షూటింగ్స్ కోసం సింగిల్ విండో సిస్టం తీసుకొస్తామన్నారు. రుషికొండ భవనాలను ఏం చేయాలో అన్నదానిపై నెల రోజుల్లో కొలిక్కి వస్తుందన్నారు. అవినీతికి కెరాఫ్ అడ్రస్గా చూపుతూ రుషికొండ భవనాలను మ్యూజియం చేయాలన్నారు. ఈసారి బీచ్ పెస్టివల్స్ జనవరిలో నిర్వహిస్తున్నట్లు మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.

మాకు రెండు రాష్ట్రాలు ముఖ్యం: నిర్మాత సురేష్

సిని పరిశ్రమ విశాఖకు రావడం కంటే ఇక్కడ లోకల్ టాలెంట్ను పోత్సాహించడం అవసరమని సినీ నిర్మాద దగ్గుబాటి సురేష్ బాబు అన్నారు. సినిమా తీరు ఇప్పుడు పూర్తిగా మారిపోయిందన్నారు. ఎక్కడ నుంచైనా సినిమా తీయవచ్చని తెలిపారు. సోషల్ మీడియా ప్రభావం సినిమా మీద విపరితంగా ఉందన్నారు. చైన్నై నుంచి హైదరాబాద్కు అతికష్టం మీద తరలివచ్చామని చెప్పారు. ఇప్పుడు తమకు రెండు రాష్ట్రాలు ముఖ్యమని స్పష్టం చేశారు. మనం తీసేది తెలుగు సినిమా కాబట్టి ఎక్కడ తీసిన ఒక్కటే అని .. అక్కడ ఇక్కడ ఉన్నది తెలుగు వాళ్లే అని అన్నారు. సిని టూరిజాన్ని అభివృద్ధి చేయాలన్నారు. మనకు చాల వనరులు ఉన్నప్పటికీ వచ్చే టూరిస్టులు మాత్రం తక్కువన్నారు. ఫ్రెండ్లీ టూరిజాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు.



# చోడవరం షుగర్స్‌ను ఆదుకోవాలని జనసేన రాజు వినతి

చోడవరం పెన్ సత్తా అక్టోబర్25: రాష్ట్రంలో సహకారం గంలో నడుస్తున్న ఒకే ఒక్క షుగర్ ఫ్యాక్టరీ గోవాడ చక్కెర కర్మాగారంను ప్రభుత్వపరంగా ఆదుకొని 25 వేల కుటుంబాలకు ఆధారం పోకుండా చూడాలని జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్చార్జి పి.వీ.ఎస్.ఎన్ రాజు కోరారు. ఎమ్మెల్సీ మరియు జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ రాజకీయ వ్యవహారాల కార్యదర్శి పసుపులేటి హరిప్రసాద్, రాష్ట్ర పౌర సరఫరా కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ లను పి.వీ.ఎస్.ఎన్ రాజు కలిసి చోడవరం చక్కెర కర్మాగారం ఆర్థిక పరిస్థితిని వివరించి ప్రభుత్వపరంగా ఆదుకోవాలని లేకుంటే 24 వేల సభ్యు కుటుంబాలు ఇబ్బంది పడతారని, వెయ్యి కార్మికుల కుటుంబాలు వీధిన పడతారని పేర్కొన్నారు. ఫ్యాక్టరీ ఆర్థిక పరిస్థితి బాగా లేదని, రైతులకు చెరుకు బకాయలు ఇంకా చెల్లించాలని, రిటైర్డ్ అయిన కార్మికులకు కనీసం గ్రాట్యూటీ కూడా చెల్లించలేదని, కార్మికులకు వేతన బకాయిలు ఉన్నాయని పి.వీ.ఎస్.ఎన్ రాజు తెలిపారు. సివిల్ సప్లై కు అవసరమైన పంచదారను ఫ్యాక్టరీ నుండి తీసుకోవాలని, ముందుగా డబ్బులు ఇస్తే ఆ సొమ్మును రైతులు, కార్మికుల బకాయిలకు ఫ్యాక్టరీ అవసరాలకు వినియోగిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటేనే గోవాడ గాడిలో పడుతుందని లేకుంటే చోడవరం మాడుగుల ప్రాంతంలో ఉన్న ఈ ఒక్క పరిశ్రమ కూడా కనుమరుగు అయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

# జవహర్ క్లబ్ కు కొత్త పాలకవర్గం

చోడవరం, అక్టోబర్25(ఆంధ్రప్రభ) స్థానిక కొత్తూరు జంక్షన్ వద్ద ఉన్న జవహర్ క్లబ్ కు కొత్త పాలకవర్గంను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లబ్ ప్రెసిడెంట్ గా పోతల ప్రకాశరావు, కార్యదర్శిగా మామిడి నాగేశ్వరరావు, ట్రెజరర్‌గా పూసర్ల రవీంద్ర లను క్లబ్ సభ్యులు ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

# డిసెంబర్ 14 న జాతీయ లోక్ అదాలత్ జిల్లా జడ్జ్ వి. నరేష్

అమలాపురం పెన్ సత్తా అక్టోబర్ 25: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాదికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశానుసారం 2024 డిసెంబర్ 14 వ తేదీ మండల న్యాయ సేవాధికార సంస్థ ఆద్వర్భంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడినని రెండో అదనపు జిల్లా జడ్జి వి నరేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు స్థానిక కోర్టు ప్రాంగణ%శీ%లోని మండల లీగల్ సర్వీస్ కార్యాలయం నందు 2024 డిసెంబర్ 14 న నిర్వహించు జాతీయ లోక్ అదాలత్ లో వివిద కోర్టులలో పెండింగ్ లో ఉన్న సివిల్ కేసులు, బ్యాంక్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులను పరిష్కరించడం జరుగు తుందన్నారు. కావున కక్షి దారులు అధిక సంఖ్యలో పాల్గోని నేషనల్ లోక్ అదాలత్ ను సద్వినియో గపరుచుకుని ఆయా కేసు లను పరిష్కరించుకోవల సిందిగా మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, 2 వ అదనపు జిల్లా జడ్జి వి నరేష్ కోరారు. ఈ జాతీయ లోక్ అదాలత్ నందు న్యాయ వాదులు, పోలీసులు అదికారులు, బ్యాంక్ అధికారులు, రెవెన్యు అధికారులు. అందరు పాల్గోని ఎక్కువ కేసులు పరిష్కరించ వలసిందిగా ప్రకటనలో కోరారు.

# వైద్య సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలి

ఏలూరు: ఏలూరు జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తామని వైద్య సిబ్బంది జవాబుదారీతనం, అంకితభావంతో సేవలందించాలని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అన్నా రు. కలెక్టరేట్‌లో ఏలూరు జిల్లా ప్రభు త్వ ప్రధాన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని కలెక్టర్ వెట్రిసెల్వి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వైద్య సేవల లో పం కారణంగా ఎలాంటి మరణం సంభవించకూడదన్నారు. వైద్య సిబ్బంది కొరత, ఆధునిక వైద్య పరికరాల కల్పనపై దృష్టి సారించామన్నారు. కలెక్టర్ వెట్రి సెల్వి మాట్లాడుతూ వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని, అత్యవసర వైద్య విభాగాల్లో సిబ్బందిని డెప్యూటేషన్‌పై నియమించాలని అధికారులను ఆదేశించారు. ఆధునిక వైద్య పరికరాల కోసం ప్రతిపాదనలు పంపాలన్నారు. ఆస్పత్రి ఆవరణలో రోగుల సహాయకులకు వెయిటింగ్ హాల్ ఏర్పాటు చేయాలన్నారు.

# రైల్వే లైన్ పెండింగ్ కేసులు పరిష్కరించి పనుల పునరుద్ధరణ చేపట్టాలి

**- కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు**



అమలాపురం పెన్ సత్తా అక్టోబర్ 25: జాతీయ రహదారి – 216, కోటిపల్లి– నరసా పురం రైల్వే లైన్ పెండింగ్ కేసులు, అభ్యంతరాలు, క్లెయిమ్స్ సర్వే ప్రక్రియ పై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పనుల పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిషా%శీ%తి స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారిని కె.మాధవి భూసేకరణ అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు పెండింగ్ అంశాలైన కోర్టు కేసులు కోల్పోతున్న భూములు, కట్టడాలకు సంబంధించి నిర్వాసితుల నుండి వచ్చిన అభ్యంతరాలు పరిష్కార స్థితిగతుల పై క్షుణ్ణంగా అధికారులతో సమీక్షించి వివిధ సమస్యల పరిష్కారానికి గడువులు విధించి ఆయా గడువుల నాటికి సమస్యలను పరిష్కరిం చాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోనసీమ ప్రాంత అభివృద్ధికి ప్రధానమైన జాతీయ రహదారి, రైల్వే లైన్ ఏర్పాటుకు స్థానిక ప్రజానీకం కూడా తమ వంతు సహకారం అందించి అభివృద్ధిలో భాగస్వా ములు కావాలని కోరారు. నిర్వాసితుల నుండి వచ్చిన అభ్యంతరాలను అధికారులు సామరస్య పూర్వక వాతావరణంలో శాంతియుతంగా చర్చించి పరిష్కరిస్తూ నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. అదేవిధంగా రైల్వే లైన్ భూసేకరణ ప్రక్రియ కొరకు బృందాలను రెవెన్యూ, రైల్వే, సర్వే తదితర శాఖలతో నియమించి సేకరించిన వివరాలను నిర్దేశిత ప్రొఫార్మాలో నింపి సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషా%శీ%తి, స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారిని కె.మాధవి, భూసేకరణ సిబ్బంది ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

# వీరేశ్వర ఆన్నదాన ట్రస్ట్‌కి భారీ విరాళం

**- ఇప్పటివరకు 10 లక్షలు పైగా వివిధ రూపంలో విరాళం అందించిన దాతలు**

**- స్వామి వారి అనుగ్రహంతో మరిన్ని విరాళాలు ఇచ్చేందుకు ముందుకు**



మురమళ్ళ పెన్ సత్తా అక్టోబర్ 25: వీరేశ్వర ఆన్నదాన ట్రస్ట్ కి స్వామి భక్తుడు హైదరాబాద్ చెందిన మాచిరాజు వెంకట సత్య సర్వేశ్వర సాయిరాం లక్ష రూపాయల విరాళం అందించారు. ప్రస్తుత ఆలయ కార్య నిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ సోదరుడు, మాచిరాజు వెంకట సత్య శుక్రవారం వీరేశ్వర అన్నదాన ట్రస్ట్ కి లక్ష రూపాయల భారీ విరాళం ఆలయ సహాయ కమీషనర్ కార్య నిర్వాహణాధికారికి అందజేశారు. మురమళ్ళ వీరేశ్వర స్వామి వారంటే తనకు అపారమైన నమ్మకమని ఇక్కడ కళ్యాణం జరిపించిన తరువాతే తమ పిల్లలకు వివాహాలు జరిగాయని, స్వామి అనుగ్రహం తమ పై సంపూర్ణంగా ఉందని సాయిరాం సంతోషం వ్యక్తం చేశారు. గతంలో ఆలయానికి సుమారు నాలుగు లక్షలు రూపాయలు విలువచేసే జనరేటర్, 4.50 లక్ష రుపాయాలతో అభిషేక మండపం టైల్స్ ఫ్లోరింగ్, రూ 3 లక్షలు తో గణపతికి వెండి కవచం అన్నికలిపి ఇప్పటివరకు సుమారు రు 10 లక్షలు పైగా ధార్మిక కార్యక్రమాలు ఆలయం లో చేపట్టారు. అలాగే రాత్రి నిత్యకళ్యాణం భక్తులు తిలకించేందుకు వీలుగా రు 4 లక్షరూపాయలతో ఎల్ ఈ డి స్క్రీన్ అందించేందుకు ముందుకు వచ్చారు. ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామల కుమార్ ఆలయ మర్యాదలతో ప్రత్యేక దర్శనం అందించి స్వామి వారి శేష వస్త్రం, చిత్రపటం, ప్రసాదం అందించి వేద ఆశీర్వచనం చేశారు. ఈ సంధర్భంగా దాతను పలువులు అభినందించారు.

# నిబంధనలకు విరుద్ధంగా గోవాడలో మద్యం దుకాణం

**- సమీపంలో సచివాలయం దేవాలయాలు**



చోడవరం పెన్ సత్తా అక్టోబర్25: మండలంలోని మరో మేజర్ పంచాయతీ గ్రామమైన గోవాడలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణం పెట్టారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గోవాడ సచివాలయం సమీపంలోను, శివాలయం రామాలయం దగ్గరలో, ముఖ్యంగా మహిళలు, విద్యార్థులు తిరిగే ప్రధాన రహదారిలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో పలువురు విమర్శిస్తున్నారు. గతంలో మద్యం దుకాణం ఫ్యాక్టరీ గేటు ఎదురుగా ఉండేదని, ఇక్కడ బెల్టు షాపు నిర్వహించే వారిని, అప్పుడే ఫిర్యాదు చేశామని, ఇప్పుడు ఏకంగా లైసెన్స్ మద్యం దుకాణం ఏర్పాటు చేశారని ఆ గ్రామానికి చెందిన జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లం రామ అప్పారావు తెలిపారు. గ్రామం మధ్యలో మద్యం దుకాణం పెట్టవద్దని ఇప్పటికే జిల్లా కలెక్టర్ కు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశానని అయినా గ్రామస్తుల బాధలు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. షాపు తెరిచిన దగ్గర నుండి క్లోజ్ చేసే వరకు మందుబాబులు రోడ్డు మీద మద్యం తాగడం చేస్తుంటారని, మద్యం దుకాణం ఉన్న ప్రాంతం మీదగా నిత్యం జనాలు తిరుగుతుంటారని, ముఖ్యంగా మహిళలు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఇప్పటికైనా ఆ దుకాణాన్ని వేరే ప్రాంతానికి తరలించాలని లేకుంటే ఆందోళన చేస్తామని అల్లం హెచ్చరించారు.

# టిడిపి సభ్యత్వ నమోదులు విజయవంతం చేయాలి



చోడవరం పెన్ సత్తా అక్టోబర్25: తెలుగుదేశం పార్టీ సభ్యత్వం నమోదులు ఈనెల 26 శనివారం నుండి ప్రారంభం కానున్నాయని టిడిపి నాయకులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ చోడవరం మండల అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్ కోరారు. స్థానిక ఎమ్మెల్యే కే.ఎస్.ఎన్.ఎస్ రాజు నియోజకవర్గంలోని ముందుగా రోలుగుంట, రావికమతం, బుచ్చియ్యపేట మండలాల్లో ఒక్కొక్క గ్రామంలో ప్రారంభించి చోడవరం మండలంలోని గంధవరంలో ఆయన ప్రారంభిస్తారని తెలిపారు. ఆ తర్వాత రోజు ముద్దుర్తి, ఆ తర్వాత దుడ్డుపాలెం ఇలా ముందుగా నిర్ణయించిన షెడ్యూలు ప్రకారం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు సభ్యత్వ నమోదు కార్యక్రమాలకు హాజరవుతారని అన్నారు. సభ్యత్వం నమోదు రూ 100 గా పార్టీ అధిష్టానం నిర్ణయించిందని, సభ్యత్వం పొందిన వారికి 2 ఏళ్లు వరకు రూ 5 లక్షలు బీమా వర్తిస్తుందని తెలిపారు. ఎవరైనా చనిపోతే దహన సంస్కారాలకు పార్టీ ఫండ్ నుండి రూ 10 వేలు ఇచ్చి ఆదుకుంటారని తెలుగు తమ్ముళ్లకు పార్టీ అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.



# తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

పరవాడ పెన్ సత్తా అక్టోబర్ 25: నేటి మధ్యాహ్నం 2.30 గంటలకు ఇరువాడ లో గల జీఎస్ కళ్యాణ మండపం లో జరుగు తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంనకు మండల నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలి అని ఆహ్వానం పలికిన మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వియ్యపు చిన్నా. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా తెదేపా అధ్యక్షులు, పెందుర్తి నియోజకవర్గం ఇంచార్జి మాజీ శాసన సభ్యులలు గండి బాబ్జి అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యులు, మాజీ జడ్పీటీసీ సభ్యులు, మాజీ ఎంపీపీ సభ్యులు, బూత్ ఇన్చార్జి లు, బూత్ కన్వీనర్ లు, ఏరియా ఇంచార్జి లు, మండల క్లస్టర్ లు, సర్పంచ్ లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్ లు, మాజీ ఎంపీటీసీ లు, సీనియర్ నాయకులు, జూనియర్ నాయకులు కార్యకర్తలు, అభిమానులు, పెద్దఎత్తున హాజరు కావాలని గండి బాబ్జి పిలుపునిచ్చారు అని చిన్నా తెలియజేసారు.



# సూరిబాబు రాజును పరామర్శించిన ఎంపీ హరీష్ మాధవ్

ఐ.పోలవరం పెన్ సత్తా అక్టోబర్ 25: ఐ. పోలవరం మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సాగిరాజు సూరిబాబు రాజు, ఆయన తండ్రి సాగిరాజు వెంకట సత్యనారాయణ రాజు ను అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మాధుర్ ఆయన స్వగృహంలో పరామర్శించారు. ఇటీవల సూరిబాబు మాతృమూర్తి లక్ష్మి కాంతమ్మ మృతి చెందిన సందర్భంగా హరీష్ మధూర్ తో పాటు మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద లక్ష్మి కాంతమ్మ చిత్రపటానికి పూలమానులు వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పమర్శించారు. ఈ కార్యక్రమంలో కాకర్లపూడి రాజేష్ ,శివ ఉంగరాల వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.


# సాలాపువానిపాలెం గ్రామంలో చోరీ

పరవాడ పెన్ సత్తా అక్టోబర్ 25: మండలం లోని సాలాపువానిపాలెం గ్రామంలో నివాసం ఉంటున్న మైచర్ల అప్పారావు సన్నాఫ్ లేట్ రాములు ఇంట్లో దొంగతనం జరిగినట్లు పరవాడ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసారని పరవాడ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్ మల్లికార్జున రావు తెలిపారు. దీని పై ఒక ప్రకటన ద్వారా వివరాలు తెలియజేస్తూ అప్పారావు అను అసామి తేదీ. 24.10.2024 న అతని స్వగ్రామం అయిన ఎం .కోడూరు వెళ్ళగా, సాలాపువానిపాలెం గ్రామంలో ఉన్న ఇంట్లో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు వారి ఇంటి తాళం పగలగొట్టి, వారి ఇంట్లో ఉన్న 7 ½ తులాల బంగారం, 30 తులాల వెండి వస్తువులు, 1,00,000 రూ దొంగతనం చేసినట్లుగా పరవాడ పోలీస్ స్టేషన్ నందు పిర్యాదు చెయ్యగా తాము కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



# విశాఖ ఇన్చార్జ్ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామికి అగనంపూడి ప్రాంత సమస్యలపై వినత

## - పాల్గొన్న కూటమి నాయకులు



గాజువాక: విశాఖపట్నం జిల్లా కి ఇన్చార్జి మంత్రిగా ప్రప్రదమగా విచ్చేసిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మాత్యులు డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామిని అగనంపూడి కూటమి నాయకులు సాలువ కప్పి పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియ జేయడం జరిగినది. అనంతరం ఎడిసి చైర్మన్ బలరెడ్డి సత్యనారాయణ అగనంపూడి చుట్టుపక్కల గ్రామాల్లో కలుపుకొని అగనంపూడి కేంద్రముగా రెవిన్యూ మండలం ఏర్పాటు చేయాలని అగనంపూడిలో గురుకుల పాఠశాలకి గత ప్రభుతం18 ఎకరాలు భూమిని ఇవ్వడం జరిగినది కావున ఆ భూమిని రద్దుచేసి ఆ స్థలము అగనంపూడి మండల కార్యాలయానికి ఉపయోగించాలని అగనంపూడి బొర్రమాంబ ఆలయం వెనకాల ఉన్న చెరువు స్థలము అగనంపూడి పునరావాస కాలనీ రావడంతో స్థలము నిరుపియోగంగా ఉన్నందున పునరావాస కాలనీ గ్రామానికి ఉపయోగపడే విధంగా యువతని ప్రోత్సహించే విధంగా క్రీడా మైదానం కి కేటాయించాలని గాజువాక రెవిన్యూ మండలంలో ఉన్న పాఠశాలలు అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో ఉన్నాయి వాటిని గాజువాక మండలానికి విలీనం చేయాలని అగనంపూడి పశు వైద్యశాలకు ప్రభుత్వం స్థలము కేటా యించడం జరిగినప్పటికీ పశు వైద్యశాల శిథిలావస్థితిలో ఉందని కావున నూతన బిల్డింగు నిర్మాణం చేపట్టాలని టాటా హోమి బాబా క్యాన్సర్ ఆస్పత్రిలో స్థానిక యువతీ యువకులకు ఉపాధి కల్పించాలని, ఫార్మాసిటీ కాలనీలకు స్మశాన వాటికను స్థలము కేటాయించి దానిలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఫార్మాసిటీ కాలనీ లో ఉన్న సచివాలయమునకు స్టాప్ ను పెంచాలని విశాఖ స్టీల్ ప్లాంట్ లో ఉద్యోగ విరమణ చేసిన వారికి నెలకు కేవలం ఒకటి నుండి 4 వేల రూపాయలే పెన్షన్ వస్తున్నదని కావున ఉక్కు రిటైర్మెంట్ ఉద్యోగులకు తెల్ల రేషన్ కార్డు ఇప్పించవలసిందిగా విశాఖ సిటీ నుండి లంకెలపాలెం సెంట్రల్ వరకు మెట్రో ట్రైన్ ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేయడం జరిగినది. వినతి పత్రం స్వీకరించిన విశాఖ ఇంచార్జ్ మంత్రి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విశాఖ పార్లమెంటరీ టిడిపి అధికార ప్రతినిధి కసిపల్లి శ్రీనివాసరావు జీవీఎంసీ 85వ వార్డు టిడిపి అధ్యక్ష కార్యదర్శులు కర్రీ దశాంధ్ర, విందుల రాజు విశాఖ పార్లమెంటరీ టిడిపి కార్యదర్శి పూడి సత్యారావు, విశాఖ జిల్లా బిజెపి లీగల్ సెల్ అధ్యక్షులు అంగులూరి ఈశ్వరరావు తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

# నేడు తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం రత్నాకర్




అనకాపల్లి పెన్ సత్తా అక్టోబర్ 25: నేడు శనివారం నుండి తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు అందరూ పాల్గొని చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ అన్న నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సారధ్యంలో తెలుగుదేశం పార్టీలో చేరాలనుకునే సభ్యుని యొక్క సభ్యత్వ నమోదు కార్యక్రమం రేపటి నుండి రాష్ట్రమంతటా ప్రారంభమవుతున్నదని అన్నారు. దీని ద్వారా తెలుగుదేశం పార్టీలో చేరాలనుకునే ప్రతి సభ్యుడు కనీస రుసుము రూ100 చెల్లించి చేరవచ్చని, ఇంతకుముందు నమోదైన సభ్యులు ఎవరైనా సభ్యత్వమును పునరుద్ధరించు కోవచ్చని తెలియజేశారు. తెలుగుదేశం పార్టీలో సభ్యత్వం తీసుకోవడం ద్వారా ప్రతి సభ్యుడు వారి కుటుంబానికి భరోసా కల్పించే విధంగా ఐదు లక్షల ప్రమాద బీమా కల్పించబడుతున్నదని అన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రతి సభ్యుని సంక్షేమం కోసం ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్, మరణించిన కార్యకర్తల పిల్లల చదువుల కోసం ఆర్థిక భరోసా వంటి సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని రాష్ట్రం లోని ప్రతి కార్యకర్త సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉన్నదని అన్నారు. అంతేకాకుండా ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం రేపటినుండి అనకాపల్లి లక్ష్మీనారాయణ నగర్‌లో గల పార్టీ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి ప్రారంభించబడుతున్నదని ఎవరైనా 18 సంవత్సరాలు నిండిన వారు ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో తమ సభ్యత్వాన్ని నమోదు చేసుకోవచ్చన్నారు. గతంలో నమోదు చేసుకోబడిన వారు తమ ఓటర్ కార్డు నెంబర్ ద్వారా నమోదు కావచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం కుటుంబానికి చెందిన ప్రతి కార్యకర్త సభ్యునిగా చేరడం, చేర్పించడం ద్వారా పార్టీ బలోపేతానికి కృషి చేయవలసిందిగా పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు.

# పశు కిసాన్ క్రెడిట్ కార్డులు



భీమవరం: జిల్లాలో సాగునీటి వినియోగ దారుల సంఘాల ఎన్నికల నిర్వహణకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమష్టిగా కృషి చేసి ఈనెల 31 నాటికి ప్రాదేశిక నియోజకవర్గాల జాబితాలను సిద్ధం చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియపై అధికారులతో సమీక్షించారు. ఎన్నికల ప్రక్రియ ఈనెల 21న ప్రారంభం కాగా వచ్చేనెల 29తో ముగుస్తుందన్నారు. జిల్లాలో 112 సంఘాల ఎన్నికలకు నోటిఫి కేషన్ జారీ చేయగా వాటిలో 98 మేజర్ ఇరిగేషన్, 14 మైనర్ ఇరిగేషన్ సంఘాలు ఉన్నాయన్నారు. ప్రాదేశిక నియోజకవర్గాల పరిధిలో 98 డబ్ల్యూయుఏలకు 12 మంది చొప్పున, 14 డబ్ల్యూయుఏలకు 6 మంది చొప్పున మొత్తంగా 1,260 మంది సభ్యులు ఉంటారన్నారు. ఈనెల 31లోపు ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా జాబితా సిద్ధం చేసి అదేరోజు ప్రకటిస్తామన్నారు. వచ్చేనెల 1, 2 తేదీల్లో అభ్యంతరాల ప్రకటన, 3న అభ్యంతరాల పరిష్కారం, అనంతరం తుది ప్రకటన విడుదల చేస్తామన్నారు. వచ్చేనెల 20న నీటి వినియోగదారుల సంఘాలకు, నీటి పంపిణీ కమిటీ ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేస్తామని, 21 నుంచి 23 మధ్య నీటి సంఘాలకు, 24 నుంచి 26 మధ్య నీటి పంపిణీ సంఘాలకు, 27 నుంచి 29 తేదీల మధ్య ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, డీఆర్ఓ జె.ఉదయ భాస్కరరావు, జిల్లా నీటిపారుదల శాఖ అధికారి పి.నాగార్జునరావు, ఆర్డీవోలు తదతరులు పాల్గొన్నారు.

# గేదెల ఆధ్వర్యంలో షిరిడి సాయిబాబా ఆలయం నిర్మాణం

## - ఆధ్యాత్మిక కేంద్రంగా కొమళ్ళపూడి





చోడవరం పెన్ సత్తా అక్టోబర్25: విశాఖ డైయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ ఆధ్వర్యంలో తన స్వగ్రామమైన కోమళ్ళపూడి గ్రామంలో శరవేగంగా శ్రీషిరిడి సాయిబాబా ఆలయం నిర్మాణం చేస్తున్నారు. అతని తల్లిదండ్రులు గేదెల కృష్ణంనాయుడు వెంకయ్యమ్మ దంపతుల ఆర్థిక సహాయంతో అన్ని హంగులతో నిర్మాణం జరిపిస్తున్నారు. మెయిన్ రోడ్డు పక్కన చెరువు సమీపంలో శ్రీషిరిడి సాయిబాబా ఆలయం పక్కన శివాలయం నిర్మాణం జరుగుతున్నాయి. ఈ రెండు ఆలయాలు ప్రారంభమైతే ఆ ప్రాంతంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటుంది. శ్రీషిరిడి సాయిబాబా ఆలయం నిర్మాణం దాదాపు పూర్తి కాగా, షిరిడి నుండి బాబా విగ్రహం రప్పించడానికి గేదెల సత్యనారాయణ సన్నాహాలు చేస్తున్నారు. రమారమి 60 సెంట్లు స్థలంలో బాబా ఆలయ నిర్మాణం, అన్నదానం కొరకు స్థలాన్ని కేటాయించారు. మెయిన్ రోడ్డు పక్కన విశాలమైన స్థలంలో బాబా ఆలయం నిర్మాణం జరుగుతుండడంతో పలువురు భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కూటమి నేతలుచే ప్రారంభింప చేయడానికి గేదెల సత్యనారాయణ భారీగా సన్నాహాలు చేస్తున్నారు.





# రోజూ నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలి



రాయచోటి: రోజూ నీటి నాణ్యత పరీక్షలను సీహెచ్ఓలు నిర్వహించి, ఫలితాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కొండయ్య అన్నారు. పట్టణంలోని కొత్తపేట రామాపురం అర్బన్ పీహెచ్‌సీలో జిల్లాలోని ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్‌లో పని చేస్తున్న సమాజ ఆరోగ్య అధికారుల(సీహెచ్ఓల)కు నీటినాణ్యత పరీక్షలపై డీపీఎంఓ రియాజ్‌బేగ్ పర్యవేక్షణలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ గతంలో కేవలం నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించే వారన్నారు. కాగా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రస్తుత వర్షా కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో రోజూ నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. పరీక్షలలో ఎక్కడైతే నీరు కలుషితమవుతోం దని తెలుస్తుందో.. అక్కడ యుద్ధప్రాతిపదిక కలుషిత నివారణ చర్యలు చేపట్టవచ్చునన్నారు. కార్యక్రమంలో డీఎంఓ వేణుగోపాల్‌తోపాటు జిల్లాలోని 375 మంది సీహెచ్ఓలు పాల్గొన్నారు.

# హెల్మెట్ వాడకంతో ప్రాణరక్షణ



ద్వారకాతిరుమల: ఒక వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మరణిస్తే.. అతడి కుటుంబం మొత్తం రోడ్డున పడుతుందని జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా మండలంలోని ఎం.నాగులపల్లి జాతీయ రహదారిపై వినూత్న రీతిలో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. గతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ధ్వంసమైన వాహనాన్ని చూపుతూ అనర్థాలను వివరించారు. ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ సందర్భంగా భార్య, పిల్లలతో బైక్‌పై వెళుతున్న ఒక వ్యక్తిని ఆపి హెల్మెట్ ఉపయోగాలపై అవగాహన కల్పించి, ఆ దంపతులకు ఎస్పీ స్వయంగా హెల్మెట్లను అందించారు. కుటుంబ స భ్యులు, పిల్లలు ద్విచక్ర వాహనంపై వెళ్లే సమయంలో వారు హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత మహిళలపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సురక్షితమైన ప్రయాణం చేయాలని, రహదారి నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. హెల్మెట్ లేని వారికి జరిమానాలు విధించడంతో పాటు హెల్మెట్ ఉపయోగాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, భీమడోలు ఇన్‌స్పెక్టర్ యూజే విల్సన్, ద్వారకాతిరుమల, భీమడోలు ఎస్సైలు టి.సుధీర్, సుధాకర్, జిల్లా ట్రాఫిక్ రికార్డు బ్యూరో కానిస్టేబుల్ మధు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మోటారు సైకిళ్ల దొంగల అరెస్ట్




ఏలూరు: మోటార్‌సైకిళ్లు చోరీ చేస్తున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన ముగ్గురిని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియో గించి పోలీసులు పట్టుకున్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం వేంసూరు మండలం కల్లూరుగూడెం గ్రామానికి చెందిన బత్తుల పవన్‌కళ్యాణ్, బీమిరెడ్డి సీతారామిరెడ్డి, దూళ్ళ కొత్తూరు గ్రామానాకి చెందిన ధనికొండ రమేష్ అనే ముగ్గురు ముఠాగా ఏర్పడి జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో మోటారు సైకిళ్ల చోరీలకు పాల్పడుతున్నారు. వీరంతా నూజివీడు టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో–6, ఏ.కొండూరు–1, బందరు తాలూకా పీఎస్–1, మైలవరం పీఎస్–2, తిరువూరు పీఎస్–1, ఒంగోలు 1 టౌన్ పీఎస్–1, కృష్ణలంక పీఎస్–2, సత్తుపల్లి పీఎస్–1, చింతలపూడి పీఎస్–1, ఇతర ప్రాంతాల్లో మరో 3 మోటారు సైకిళ్లను చోరీ చేశారు. ఈ నేపథ్యంలో ఏలూరు జిల్లా సరిహద్దుల్లో అను మానిత వ్యక్తుల కదలికలపై నూజివీడు పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ట్రాక్ చేస్తూ ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, 19 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరాల అదుపునకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతుందని, చోరీ సొత్తు రికవరీలో కూడా ప్రతిభను చాటుకుంటున్నారని చెప్పారు. 2024 జూలై నుంచి అక్టోబర్ వరకూ ఆయా కేసుల్లో చోరీ సొత్తును రూ.కోటి 93 లక్షల 13 వేల 892 రికవరీ చేశామన్నారు. 2023 ఏడాదితో పోల్చితే ఈ సంవత్సరంలో భారీగా రికవరీ చేసినట్లు ఎస్పీ చెప్పారు. ఈ సమావేశంలో ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఏలూరు డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్, నూజివీడు కేవీబీఎన్‌వీ ప్రసాద్, నూజివీడు సీఐ సత్యశ్రీనివాస్, ఎస్సై జ్యోతిబసు ఉన్నారు.

# విశాఖ ఖ్యాతిని పెంచేలా ప్రణాళికలు

## - సమీక్షలో ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి



విశాఖపట్నం: రాష్ట్ర ఆర్థిక రాజధానిగా ఎదుగు తున్న విశాఖ నగర ఖ్యాతిని మరింత పెంచేలా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని జిల్లా ఇన్‌ఛార్జి, రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజ నేయస్వామి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధికి సంబంధించి అమలు చేయాల్సిన కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు. సమీక్ష సమావేశంలో, తదుపరి మీడియాతో ఇన్‌ఛార్జి మంత్రి మాట్లాడుతూ విశాఖ నుంచి భోగాపురం విమానాశ్ర యానికి 45 నిమిషాల్లో చేరుకొనేలా రహ దారులను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. లంకెలపాలెం నుంచి భోగాపురం వరకు 12 కూడళ్లు ఇబ్బందికరంగా ఉన్నాయని, ఆయా చోట్ల పైవంతెనలు నిర్మించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారి 16ని విస్తరించడం, లేదా బీచ్ రోడ్డును భోగాపురం విమానాశ్రయానికి అను సంధానం చేయడంపై సమావేశంలో చర్చించారు. దీనికి సంబంధించి జీఎంఆర్ సంస్థ ప్రతినిధులు ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను ప్రజాప్రతినిధులు తిలకిం చారు. నగర బృహత్తర ప్రణాళిక(మాస్టర్ ప్లాన్)కు సంబంధించి వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై సీపీ శంఖబ్రత బాగ్చీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. నగరంలో కాలుష్య నివారణ చర్యలను పటిష్ఠంగా అమలు చేయాలని మంత్రి సూచించారు. పంచగ్రామాల భూసమస్యను కొలిక్కి తేవాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. జీవీ ఎంసీ పరిధిలో 100శాతం యూజీడీ వ్యవస్థను అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. విభిన్న ప్రతిభావంతుల కోసం 25 ఎకరాల స్థలంలో క్రీడా మైదానం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. దీని కోసం రూ.200కోట్లు కేటాయిం చామన్నారు. విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ ఫీజుల విషయంలో విద్యార్థులను విద్యా సంస్థల నిర్వాహకులు ఇబ్బంది పెట్టరాదన్నారు. ధ్రువపత్రాలు వారి వద్ద ఉంచుకోవడం చట్ట విరుద్ధమన్నారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, జేసీ మయూర్‌అశోక్, డీసీపీ అజిత, డీఆర్వో కె.మోహన్‌కుమార్, విశాఖ, భీమిలి ఆర్డీఓలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వయోవృద్ధులు, తల్లిదండ్రులు, పోషణ, సంక్షేమ చట్టం కరపత్రాలను విడుదల చేశారు.

# యంత్రాలతో ఇసుక తవ్వకాలకు అనుమతి లేదు



మచిలీపట్నం: జిల్లాలో ఇసుక తవ్వకాలు మాన్యువల్ పద్ధతిలోనే చేపట్టాలని, జేసీబీ, పొక్లెయిన్ వంటి యంత్రాలను ఉపయోగించడానికి అనుమతులు లేవని కృష్ణా కలెక్టర్ డి.కె.బాలాజీ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో ఇసుక తవ్వకాలపై రవాణాదారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లాలోని ఇసుక రీచ్‌లలో యంత్రా లను ఉపయోగించకూడదన్నారు. కేవలం మనుషులతోనే తవ్వకాలు చేపట్టాలని సూచించారు. ఈ విషయంలో ఎలాంటి ఉదాసీనత ఉండదని, నిబంధనలు ఉల్లంఘించిన వారి యంత్రాలను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. ఈ విషయాన్ని రవాణాదారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ సమా వేశంలో ఎస్పీ ఆర్.గంగాధరరావు, జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు



భీమవరం: జిల్లాలో సార్వా ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లను పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. భీమవరం కలెక్టరేట్‌లో సార్వా ధాన్యం కొనుగోలుపై ఆర్డీఓలు, తహసీల్దార్లు, సివిల్ సప్లయీస్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహిం చారు. రైతు సహాయక కేంద్రాల్లో 25 శాతం గోనె సంచులు సిద్ధంగా ఉంచాలని, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లను రైస్ మిల్లుల వద్ద వెహికల్ మానిటరింగ్ అధికారులుగా నియమి స్తున్నామన్నారు. డీఆర్వో జె.ఉదయభాస్కరరావు, ఆర్డీఓలు కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, దాసి రాజు, వై.భవాని శంకరి, సివిల్ సప్లయీస్ డీఎం టి.శివరామకృష్ణ, డీఎస్ఓ ఎన్.సరోజ, ఏఎస్ఓ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ సరుకులను దారి మళ్లించే వారిపై నిఘా ఉంచాలి

**- అవకతకలకు పాల్పడిన వారిపై 6ఏ కేసులు నమోదు చేయాలి - పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించిన జేసీ కె. మయూర్ అశోక్**



విశాఖపట్టణం: రేషన్ దుకాణాల్లో, ఎం.ఎల్.ఎస్. (నిల్వ కేంద్రాలు) పాయింట్లలో విస్తృత తనిఖీలు చేపట్టాలని అవకతవకలకు పాల్పడిన వారిపై 6ఏ కేసులు నమోదు చేయాలని పౌర సరఫరాల శాఖ అధికారులను, తనిఖీ సిబ్బందిని జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ ఆదేశించారు. రేషన్ సరుకులు దుర్వినియోగం కాకుండా చూడాలని, దారి మళ్లించే వారిపై గట్టి నిఘా ఉంచాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై క్రిమినల్ చర్యలకు ఉపక్రమించాలని పేర్కొన్నారు. కలెక్టరేట్ మీటింగు హాలులో శుక్రవారం ఉదయం ఆయన పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారులు, తనిఖీ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రేషన్ సరుకుల పంపిణీ, దుకాణాల నిర్వహణ, ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ అందజేత, తనిఖీలు, కేసుల నమోదు తదితర అంశాలపై సమీక్షించారు.క్షేత్రస్థాయిలో బినామీల పేర్లపై కొంతమంది దుకాణాలు నిర్వహిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, రేషన్ సరుకులు కూడా సమీపంలో ఉన్న హెూల్ సేల్ దుకాణాలకు తరలిపోతున్నట్లు పలు పత్రికల్లో ప్రతికూల కథనాలు వస్తున్నాయని దీనిపై కింది స్థాయి అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రేషన్ దుకాణాలు, ఎం.ఎల్.ఎస్. పాయింట్లలో విస్తృత తనిఖీలు చేపట్టాలని వాస్తవ పరిస్థితులపై నివేదిక అందించాలని ఆదేశించారు. హెూల్ సేల్ దుకాణాలపై బృందాలుగా వెళ్లి దాడులు చేయాలని సూచించారు. రాత్రి పూట కూడా తనిఖీలు చేపట్టాలని, ఎక్కడైనా తప్పు జరిగినట్లు గుర్తిస్తే క్రిమినల్ కేసులు పెట్టాలని సంబంధిత అధికారులకు చెప్పారు. రబ్బర్ స్టాంపుల వినియోగంలో కూడా అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని దీనిపై కూడా దృష్టి సారించాలన్నారు. పక్కాగా తూనికలు చేపట్టిన తర్వాత మాత్రమే గోదాముల నుంచి ఎం.ఎల్.ఎస్. పాయింట్లకు సరుకులు సరఫరా చేయాలని ఆదేశించారు.

# వైఎస్సార్ అభిమానులకు షర్మిల మూడు పేజీల బహిరంగ లేఖ

అమరావతి: ఏపీ మాజీ సీఎం జగన్‌పై వైఎస్ షర్మిల మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు వైఎస్సార్ అభిమానులకు 3 పేజీల బహిరంగ లేఖ రాశారు. వైఎస్ అభిమానులకు వాస్తవాలు తెలియజేసే ప్రయత్నంలో భాగంగానే ఈ లేఖ రాసినట్లు పేర్కొన్నారు. “ఈరోజు పొద్దున సాక్షి పేపర్ చూశాను. సాక్షి మీడియా జగన్ మోహన్ రెడ్డి చేతిలో ఉంది. కాబట్టి ఏదైనా నమ్మించగలరు. అయినా వైఎస్సార్ అభిమానులకు అసలు వాస్తవాలు తెలియజేసే ప్రయత్నం నాది. అమ్మ వైఎస్ విజయమ్మ, నాన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి గురించి ఒక పుస్తకం రాశారు. అందులో నాన్న గురించి ప్రత్యేకంగా ఒక మాట రాశారు. ‘రాజశేఖర్ రెడ్డి గారికి లోకం అంతా ఒకెత్తయితే.. తన బిడ్డ షర్మిల ఒకెత్తు అని రాశారు. నాన్నకు నేనంటే ప్రాణం. నాన్న నన్ను ఎప్పుడూ ఆడపిల్ల కదా అని చిన్న చేసో, తక్కువ చేసో చూడలేదు. నాన్న బతికి ఉన్నన్ని రోజులూ ఒకే మాట అనేవారు. ‘నా’ నలుగురు గ్రాండ్ చిల్డ్రన్ నాకు సమానం.

నలుగురు గ్రాండ్ చిల్డ్రన్‌కూ సమాన వాటా.. అది వైఎస్సార్ మ్యాండేట్... వైఎస్సార్ బతికి ఉండగా స్థాపించిన అన్ని కుటుంబ వ్యాపారాల్లో నలుగురు గ్రాండ్ చిల్డ్రన్‌కూ సమాన వాటా ఉండాలి. రాజశేఖర్ రెడ్డి ఉండగా స్థాపించిన అన్ని వ్యాపారాలు కుటుంబ వ్యాపారాలే. అవి జగన్ మోహన్ రెడ్డి సొంతం కాదు. ఉన్న అన్ని కుటుంబ వ్యాపారాలకు జగన్ ‘గార్డియన్’ మాత్రమే. అన్ని వ్యాపారాలు నలుగురు చిన్న బిడ్డలకు సమానంగా పంచి పెట్టాల్సిన బాధ్యత ఆయనదే. ఇది రాజశేఖర్ రెడ్డి మ్యాండేట్. వైఎస్సార్ ఈ ఉద్దేశం ఆయన బిడ్డలమైన మాకు, ఆయన భార్యకు, కేవీపీ రామచంద్రరావు, వైవీ సుబ్బారెడ్డి, విజయ సాయిరెడ్డి సహా సన్నిహితులందరికీ స్పష్టంగా తెలుసు. నాన్న బతికి ఉండగా స్థాపించిన అన్ని వ్యాపారాల్లో సరస్వతి, భారతి సిమెంట్స్, సాక్షి మీడియా, క్లాసిక్ రియాలిటీ, యలహంక ప్రాపర్టీ, ఇలాంటివి ఏమైనా.. నలుగురు గ్రాండ్ చిల్డ్రన్‌కు సమాన వాటా ఉండాలన్నది వైఎస్ఆర్ మ్యాండేట్.

జగన్ చెబుతున్నవన్నీ కుటుంబ ఆస్తులే... ఒక్క సండూర్ మినహా రాజశేఖర్ రెడ్డి బతికున్నంత వరకు ఏ ఒక్క ఆస్తి పంపకం కూడా జరగలేదు. వైఎస్సార్ హఠాత్తుగా మరణించారు. తర్వాత కూడా ఏ ఆస్తి పంపకాలు జరగలేదు. ఈరోజు వరకు నాకు న్యాయంగా రావాల్సిన ఒక్క ఆస్తి కూడా నా చేతుల్లో లేదు. స్వార్జితం అని జగన్ మోహన్ రెడ్డి చెబుతున్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులే. రాజశేఖర్ రెడ్డి బతికి ఉన్నప్పుడే ఆస్తులు పంపిణీ చేశారనేది అవాస్తవం. ఈరోజు సాక్షిలో చూపినట్లుగా మా తాతల ఆస్తి చిన్నప్పుడే నా పేరు మీద పెట్టినంత మాత్రాన, అది నాన్న నాకు పంచిన ఆస్తి కాదు. ఇతరులతో ఒక వ్యాపారంలో చిన్న భాగం నా పేరు మీద పెడితే అది ఆస్తి పంచి ఇచ్చినట్లు కాదు. ఆస్తి పంచడం అంటే ఇవిగో ఈ ఆస్తులు.. నీకు ఇక ఇంతే అని మా నాన్న నాకు చెప్పి ఉంటే అది ఆస్తి పంచేయడమంటే..! నేను జగన్ మోహన్ రెడ్డి ఆస్తుల్లో వాటా అడుగుతున్నాను అనేది హాస్యాస్పదం. ఇవన్నీ కుటుంబ ఆస్తులు కనుక రాజశేఖర్ రెడ్డి నలుగురు చిన్న బిడ్డలకు సమానంగా పంచాలి అనుకున్నారు. కాబట్టే ఈ రోజు వరకు వీటి గురించి మాట్లాడుతున్నాం.

ఏ స్వార్థం లేకుండా ఆయన పార్టీని భుజాలపై మోశాను... నాకంటూ వ్యక్తిగతంగా



ఈ ఆస్తులపై మోజు లేదు. వీళ్లు పెట్టిన హింసలకు ఈ ఆస్తులు కావాలనే కోరిక కూడా లేదు. కేవలం నా బిడ్డలకు ఈ ఆస్తులు చెందాలి అనేది రాజశేఖర్ రెడ్డి అభిమతం గనుక.. ఈ రోజు వరకు కూడా అమ్మైనా, నేనైనా తపన పడుతున్నాం. ఇప్పటికీ అమ్మ వెయ్యి సార్లు వీళ్లను అడిగి ఉంటుంది. వందల కొద్దీ లేఖలు రాసి ఉంటుంది. అయినా నా బిడ్డలకు చెందాల్సిన ఆస్తిలో ఒక్కటి కూడా ఇవ్వలేదు. రాజశేఖర్ రెడ్డి చనిపోయిన తర్వాత 10 ఏళ్లు జగన్ ఇబ్బందులు పడితే, అవి నా ఇబ్బందులు అనుకొని.. నా శక్తికి మించిన సాయం చేశాను. తోడబుట్టిన వాడికోసం నా బిడ్డలను సైతం పక్కనపెట్టి ఆయన్ను, ఆయన పార్టీని ఏ స్వార్థం లేకుండా నా భుజాల మీద మోశాను. ఆ 10 ఏళ్లు నా అవసరం ఉంది అనుకున్నారో.. ఏమో.. నన్ను బాగానే చూశారు. పెద్ద కూతురు అన్నారు. రాజశేఖర్ రెడ్డి ఊహించినట్లుగానే గ్రాండ్ చిల్డ్రన్ నలుగురు సమానం అన్నట్లుగానే వ్యవహరించారు. ఆ 10 ఏళ్లలో రూ. 200 కోట్లు ఇచ్చామని చెప్తున్నది ఇందులో భాగంగానే. ఆ 10 ఏళ్లు నా బిడ్డలకు సమాన వాటా ఉందని గుర్తిస్తూ.. కంపెనీలోని డివిడెండ్‌లో సగం వాటా నాకు ఇవ్వడమే ఈ రూ. 200 కోట్లు. వాళ్లు చేసింది ఉపకారం కాదు. ప్రేమతో ఇచ్చింది అంతకంటే కాదు. నాకు సమాన వాటా ఉంది కాబట్టి డివిడెండ్‌లో సగం వాటా ఇచ్చారు. అది కూడా అప్పుగా చూపించమన్నారు.

సీఎం కాగానే జగన్ మారిపోయారు... సీఎం కాగానే జగన్ గుర్తుపట్టలేనంతగా మారిపోయారు. నాపై చిన్నచూపే కాదు.. సీఎం కాగానే విడిపోదామని ప్రతిపాదించారు. విడిపోవద్దని అమ్మ, నేను చెప్పాం. ఆస్తులు పంచుకుందామని విజయవాడకు రమ్మన్నారు. భారతి సిమెంట్స్, సాక్షిలో ఎక్కువ వాటా కావాలని అడిగారు. 60 శాతం తీసుకుంటా.. 40 శాతం ఇస్తా అని జగన్ ప్రతిపాదించారు. ఆ తర్వాత అరగంటలో ఆస్తుల వాటా తేలిపోయింది. కొద్ది వారాల్లోనే ఎంవోయూ కూడా తయారైంది. నాకు రావాల్సిన వాటా ఇచ్చారు తప్పితే.. ప్రేమాభిమానాలతో కాదు.

2021లో నేను రాజకీయాల్లో అడుగుపెట్టా. జగన్‌కు ఇష్టం లేకుండా వచ్చానని కోపమొచ్చింది. రాజకీయాల్లో నన్ను అణచి వేసేందుకు ఆయన చేయని ప్రయత్నం లేదు. ఆంధ్రాలో కాంగ్రెస్ తరఫున ప్రచారం చేస్తే అవమానించారు. సోషల్ మీడియాలో నాపై వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారు. నన్నే కాదు.. వివేకాపైనా సాక్షి మీడియాలో అసభ్యకరంగా ప్రచురించారు. ఎన్నికల్లో ఓటమికి నేనే కారణమని బలంగా నమ్మారు. విరోధం వద్దు.. మాట్లాడుకుందామని బంధువులను పంపారు. జగన్, భారతి, అవినాష్‌కు వ్యతిరేకంగా మాట్లాడొద్దని షరతు పెట్టారు. బంధువులు ఎంత ఒత్తిడి చేసినా ఆ షరతులకు నేను ఒప్పుకోలేదు. అదే కోపంతో మళ్లీ నాతో పాటు అమ్మపై ఎన్‌సీఎల్‌టీలో కేసు వేశారు. మేం మోసం చేసి షేర్లు తీసుకున్నామని పేర్కొన్నారు.

తల్లిపై కేసు వేసిన దుర్మార్గుడనే పేరు వస్తుందనే... ప్రజల్లో అమ్మపై కేసు వేసిన దుర్మార్గుడనే పేరు వస్తుందని మాట మార్చారు. జగన్ బెయిల్ రద్దుకు కుట్ర చేస్తున్నామనే అభియోగం మోపారు. నిజానికి బెయిల్ రద్దు కాదు.. ఎందుకంటే సరస్వతి షేర్స్ అటాచ్ కాలేదు. కంపెనీల్లో ఈడీ అటాచ్ చేసింది షేర్లను కాదు.. రూ.32కోట్ల విలువైన భూములనే. షేర్ల బదిలీకి, ఆయన బెయిల్ రద్దుకు ఎలాంటి సంబంధం లేదు. సొంత తల్లిని కోర్టుకు ఈడ్చడం.. ఆ తల్లికి ఎంత అవమానం? అమ్మను బాధపెట్టొద్దని.. అన్యాయంగా మాపై కేసు వేసిన సంగతి బయటపెట్టలేదు. కానీ కేసు వేసిన నెల రోజులకు ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీని వెనుక జగన్ కారణమని ఎందుకు అనుకోకూడదు? నేను జగన్‌కు లేఖ రాస్తే.. అది తెదేపా సోషల్ మీడియా ఖాతాలో పోస్టయితే నాకేంటి సంబంధం? నేను కానీ.. నా మనుషులు కానీ బయటపెట్టలేదని బైబిల్‌పై ప్రమాణం చేస్తా. చంద్రబాబు చేతిలో బాణం కావాల్సిన అవసరం వైఎస్సార్ బిడ్డకు లేదు. జగన్ ఎవరి కొంగు చాటున ఉండి ఇదంతా చేస్తున్నారో అందరికీ తెలుసు. ఆస్తి, అధికారం కోసం ఇదంతా చేస్తున్నారని ప్రజలంతా గమనిస్తున్నారు.

నా గురించి తెలియాలనే వాస్తవాలను మీ ముందుంచుతున్నా... నా గురించి తెలియాలనే వాస్తవాలను మీ ముందు ఉంచుతున్నా. నేను మోసం చేసినట్లు, ఆస్తి కోసం అత్యాశ పడినట్లు భావించవద్దనే ఈ లేఖ రాశా. ఎంవోయూ నా చేతుల్లో ఐదేళ్లున్నా.. ఒక్క ఆస్తి కూడా ఇవ్వలేదు. ఏ ఒక్క మీడియా, కోర్టుకు ఎంవోయూ విషయాన్ని నేను బయటపెట్టలేదు. ఆర్థికంగా ఇబ్బంది పడినా కుటుంబ గౌరవం కోసం ఎంవోయూను బయటపెట్టలేదు. వైఎస్సార్ అభిమానులను మానసిక క్షోభకు గురిచేసిందెవరో మీకు తెలుసు. కుటుంబ బంధం, స్నేహబంధంతో మనుషులు ఒక్కటవుతారు. ‘వైఎస్సార్ బంధం’ ఏర్పరచుకున్న ప్రతి వైఎస్సార్ బంధువుకి వివరణ ఇస్తున్నా. అమ్మను, నన్ను తప్పుగా అర్థం చేసుకోవద్దనే వాస్తవాలు చెబుతున్నా”అని షర్మిల లేఖలో పేర్కొన్నారు.

“PEN SATTA” Telugu Daily Printed, Published and owned by CHINTAMANENI ANILKUMAR, D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. Published at D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. and Printed at Chaitanya Vaaradhi Printers, Do.No.2-99, Bharinikam, Paravada, Anakapalli, Visakhapatnam-531 021. Editor : CHINTAMANENI ANILKUMAR, D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. Cell : 98853 15759, RNI.NO.APTEL/2023/87729, E-mail:anilchintamaneni@gmail.com